స్థానిక ఎన్నికలకు సన్నద్ధం

- ఓటరు జాబితా సిద్ధం
- వార్డుల వారీగా విభజన
- రెడీ చేసిన కార్యదర్శులు
- ఒక కుటుంబం ఓట్లు.. ఒకే వార్డులో
- అధికారులు, సిబ్బందికి మొదటి విడత శిక్షణ పూర్తి


కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో టిపోల్‌లో ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్న కార్యదర్శులు

కరీంనగర్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే గ్రామపంచాయతీల వారీగా కొత్త ఓటర్ల జాబితా సిద్ధం కాగా గ్రామం యూనిట్‌గా ఓటర్ల జాబితాను గ్రామ కార్యదర్శులు రెడీ చేశారు. గత జనవరిలో ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా వార్డుల వారీగా జాబితాను విభజించారు. ఒక కుటుంబం ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గ్రామపంచాయతీల ఓటరు జాబితాను ఎంపీడీవో లాగిన్‌తో టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచారు. జిల్లాలో మొత్తం 318 గ్రామపంచాయతీలు ఉండగా 10,82,751 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 5,52,353 మంది, మహిళ ఓటర్లు 5,30,337 మంది ఉన్నారు. ఇతరులు 61మంది ఉన్నారు. ఎన్నికల్లోగా కొత్త ఓటర్లు నమోదైతే అనుబంధ జాబితాలో నమోదు చేయనున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎప్పుడైనా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉండడంతో ప్రభుత్వం హుటాహుటిన గుజరాత్ రాష్ట్రం నుంచి జిల్లాకు బ్యాలెట్ బాక్సులను తెప్పించింది.

➡ బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు సిద్ధం

పంచాయతీ ఎన్నికలకు కావాల్సిన బ్యాలెట్ బాక్సులను జిల్లా అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో ప్రస్తుతం 2వేలకు పైగా బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. ఇవి కాకుండా గుజరాత్ నుంచి 1010, మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి 740బాక్సులు తెప్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలో 15 జెడ్పీటీసీ స్థానాలు, 170 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తును ముమ్మరం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల కోసం 930పోలింగ్ కేంద్రాలు ఖరారు చేశారు. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, వార్డు సభ్యులకు సంబంధించి తెలుపురంగు బ్యాలెట్ పత్రాలు ముద్రించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఒక చోట పోలింగ్ పూర్తవ్వగా మరో రెండు విడతల్లో జరిగే గ్రామాలకు బ్యాలెట్ బాక్సులను తరలించే ఏర్పాట్లు పూర్తి చేశారు. గత నెలలో పూర్తయిన ఓటర్ల సవరణ జాబితా ఆధారంగా గ్రామపంచాయతీ వార్డుల వారీగా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఆయా పంచాయతీల్లో జనాభా, ఓటర్లను బట్టి ఆరు నుంచి 20కిపైగా వార్డులు ఉండనున్నాయి. ఒక్కోవార్డులో 40 నుంచి 300కిపైగా ఓటర్లు ఉండనున్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీల వారీగా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో మండల పరిషత్ కార్యాలయాల్లో కార్యదర్శులు, సిబ్బంది మ్యాపింగ్ ప్రక్రియ ఏర్పాట్లలో తలమునకలయ్యారు.

స్ట్రాంగ్ రూంల ఏర్పాట్లు

బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల భద్రతకు జిల్లా కేంద్రంలో మూడు చోట్ల స్ట్రాంగ్‌రూంలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో గంగాధర, రామడుగు, చొప్పదండి, కొత్తపల్లి, కరీంనగర్ మండలాలకు సంబంధించినవి భద్రపర్చనున్నారు. బీఆర్ అంబేద్కర్ మైదానంలో వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజూరాబాద్, సైదాపూర్ మండలాలు, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చిగురుమామిడి, గన్నేరువరం, తిమ్మాపూర్, శంకరపట్నం, మానకొండూర్ మండలాల కోసం ఏర్పాట్లు చేసేందుకు ఎన్నికల నిర్వహణకు మూడు చోట్ల స్ట్రాంగ్‌రూంలను ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో ఓటర్లు	10,82,751
మహిళలు	5,30,337
పురుషులు	5,52,353
ఇతరులు	61
గ్రామపంచాయతీలు	318
వార్డులు	2,962
జెడ్పీటీసీ స్థానాలు	15
ఎంపీటీసీలు	170
పోలింగ్ కేంద్రాలు	2,962

➡ సిబ్బంది వివరాల సేకరణ

పంచాయతీ ఎన్నికలకు జిల్లాలో ఇప్పటికే రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి మొదటి విడత శిక్షణ నిర్వహించారు. కొంత మంది ఉద్యోగులు రిటైర్డు కాగా కొంత మంది ఉద్యోగులు వచ్చారు. దీంతో గతంలో రూపొందించిన జాబితాను సవరించి నూతన జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేస్తున్నారు. 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రానికి ఒక పీవోతో పాటు ఓపీవో, అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే ఓపీవోలను అదనంగా నియమించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై డీపీవో జగదీశ్వర్‌ను వివరణ కోరగా అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యామని, ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వచ్చిన సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆలయ గాలిగోపురం నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న అర్చకులు, తదితరులు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ గాలిగోపురం నిర్మాణ పనులు ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు ఆదివారం ప్రారంభించారు. గాలిగోపురం నిర్మాణానికి దాతలు రూ.పదిలక్షలు కంట్రిబ్యూషన్ చెల్లించగా, దేవదాయశాఖ రూ.నలభై లక్షలు మంజూరు చేసింది. దాతలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో త్వరలో గాలిగోపురం నిర్మాణం చేస్తామని చైర్మన్ కోరెం రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ కోరెం రాజిరెడ్డి, ధర్మకర్తలు తిరుపతి, లక్ష్మణ్‌రావు, మీస రమేశ్, రత్నం, మాజీ చైర్మన్‌లు మలహర్‌రావు, శ్యాంరావు, దాతలు, అర్చకులు శేషం మురళీధరాచర్యులు, మాధవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మున్నూరుకాపులు

జమ్మికుంట: పట్టణంలోని దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయం ఆవరణలో 20న నిర్వహించే హుజూరాబాద్ నియోజకవర్గం మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు ఏబూషి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శ్రావణ మాసం పురస్కరించుకొని కులబాంధవులందరు వన భోజనాలకు వెళ్లేందుకు నిర్ణయించామని, నియోజకవర్గంలోని హుజూరాబాద్, కమలాపూర్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండాలకు చెందిన కాపులు పార్టీలకు అతీతంగా కుటుంబ సమేతంగా వనభోజనాలకు విచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల అధ్యక్షులు తోట లక్ష్మణ్, చేరాలు, రమేష్, నాయకులు ఆకుల రాజేందర్, సాయిని రవి, సారంగం, పొనగంటి మల్లయ్య, ఆకుల రాజయ్య, కడెం జనార్దన్, కొలకాని రాజు, కాసర్ల రాములు, రవికుమార్, కొంరయ్య, సతీష్, సురేష్ పలువురు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లి గ్రామానికి చెందిన మండల సుదర్శన్ హుజూరాబాద్ చేనేత సహకార సంఘంలో కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సంఘం పర్సన్ ఇంచార్జి ఎలిగేటి ఉపేందర్, మేనేజర్ నక్క వైకుంఠం, అసిస్టెంట్ మేనేజర్ మంచికట్ల కోటిలింగం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.ఎనిమిది వేలు అందజేశారు.

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన గోనెల చంద్రయ్య కుటుంబానికి మిలినీయం యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.పదివేలు అందించారు. చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బండారి రవికుమార్, కోశాధికారి లంకిసిరి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ పరిపాటి మహిపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తిప్పారపు సురేశ్, కట్కోజ్వల ప్రశాంచారి, దుద్దేల రాజు, పడాల శ్రీఇనవాస్ తదితరులున్నారు.

అట్రాసిటీ కేసు

జమ్మికుంట: గొర్రెల అమ్మకంలో కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు గొర్రెల అమ్మకంలో గొడవపడ్డారు. మధ్యలో వచ్చిన వ్యక్తిని కులం పేరుతో దూషించడంతోపాటు బూతులు తిడుతూ అవమానించాడని బాధితుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

రెండు జేసీబీలు సీజ్



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ అధికారులు ఆదివారం రెండు జేసీబీలను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కనుకయ్య హెచ్చరించారు.



వీణవంక: మండలంలోని బేతిగల్–జగ్గయ్యపల్లి రోడ్డుపై ఊర చెరువు వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. అక్కడక్కడ కూలిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఇల్లందకుంట నం.9440818421

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం


చొప్పదండి: జెండా ఎగురవేస్తున్న శ్రీనివాస్ రెడ్డి


గంగాధర: జెండా ఎగురవేస్తున్న నాయకులు

గంగాధర: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని పార్టీ మండల అధ్యక్షుడు పురమల్ల మనోహర్ అన్నారు. పల్లెపల్లెకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపూర్, లక్ష్మీదేవిపల్లి, మధురానగర్ గ్రామాలలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు అర్హులందరికీ పథకాలు చేరేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, తోట కరుణాకర్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, రోమాల రమేష్, సత్తుకనుకయ్య, సాయిగౌడ్, గుజ్జుల బాపురెడ్డి, కర్ర బాపురెడ్డి, అట్ల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం దిశగా పరిపాలన

చొప్పదండి: ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా పరిగెడుతున్నాయని, ఇందిరమ్మ రాజ్యం దిశగా పరిపాలన కొనసాగుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని దేశాయిపేటలో ఆదివారం పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వం అండా కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేష్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పురం రాజేశం, పెరుమాండ్ల రవీందర్, నిజానపురం చందు, గుర్రం రాజేందర్ రెడ్డి, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కేంద్రం అణచివేత ధోరణి


హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న నాయకులు


చొప్పదండి: పుస్తక సమీక్షలో పాల్గొన్న వక్తలు

హుజూరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలు రాజకీయంగా ఎదగకుండా అణిచివేత ధోరణిని అవలంబిస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేయకుండా రిజర్వేషన్లకు మతం రంగు పులుముతోందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రిజర్వేషన్ల గురించి మాట్లాడకుండా కేవలం తెలంగాణలో మతప్రాతిపదికన ప్రజలను విభజించడం కోసం రిజర్వేషన్లను మతానికి పరిమితం చేస్తున్నారని విమర్శించారు. చట్ట సవరణ చేసి భారత రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని, ఆ దిశగా బీసీ రిజర్వేషన్లకు సైతం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఎంపీలతో ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు. కేంద్రం చేస్తున్న మోసాన్ని ప్రజలను వివరించి జాగృతం చేస్తామన్నారు. కులగణన జరపాలని దేశవ్యాప్తంగా డిమాండ్ చేస్తుప్పటికీ నాన్చుడు ధోరణిని ప్రదర్శిస్తున్న కేంద్రానికి ప్రజా పోరాటాల ద్వారా బుద్ధి చెప్పాలని, సీపీఎంకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతూ పోరాటాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ధర్నాలో నాయకులు దాట్ల రత్నాకర్, మాట్ల చిరంజీవి, ఇమ్మడి శ్రీకాంత్, శనిగరపు కొమురయ్య, ఉమా సరోజన, ములుగూరు ప్రేమ్ కుమార్, ఆకునూరి సుధాకర్, వడ్లూరు లక్ష్మీనారాయణ శంకర్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి

చొప్పదండి: చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని వక్తలు కోరారు. పట్టణ శివారులోని గిర్వాణి కళాశాలలో ఆదివారం ఓబీసీ పోరుబాట పుస్తక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి రూపొందించిన ఓబీసీ పోరుబాట పుస్తకంపై పలువురు బీసీ నాయకులు మాట్లాడారు. బీసీలు ఐకమత్యంతో రాజ్యాధికారం సాధించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రవీందర్, మురళి, రమేష్, మాజీ జెడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, ఎలిగేటి తిరుపతి, మునిగాల సుధాకర్‌గౌడ్, ఎన్నం మనోహర్, నాగభూషణం, రాజేశం, కృష్ణ పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై శివశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి


నివాళి అర్పిస్తున్న నాయకులు

గంగాధర: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రి, గవర్నర్ పుంజాల శివశంకర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ కన్వీనర్ మడ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శివశంకర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్సీ, బీసీల అభ్యున్నతి కోసం శివశంకర్ నిర్విరామంగా కృషి చేశాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తు కనుకయ్య, రామిడి రాజిరెడ్డి, ఆకుల మధుసూదన్, పడితపల్లి కిషన్, వేముల అంజి, దాతు అంజి, తూము మల్లారెడ్డి, వాసాల మొండయ్య, గంగాధర్, సామంతుల శ్రీనివాస్, బేతి మధుసూదన్, పెరుక శంకర్, వేముల గంగన్న తదితరులు పాల్గొన్నారు.

గర్శకుర్తిలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన కెల్విన్ ఆసుపత్రి వైద్యసిబ్బంది స్థానిక సరస్వతి విద్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రుల వారు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని లయన్స్ క్లబ్ కార్యదర్శి అన్నల్‌దాస్ శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కముటం అనిల్, కొలిపాక రమేష్, మధు, రేణికుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న రాష్ట్ర డ్రైవర్‌అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ హాసమ్ హుస్సేన్

కరీంనగర్: నగరంలోని సవరన్‌స్ట్రీట్‌లో గల తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్స్ సంఘం భవనంలో ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా డ్రైవర్ల సమక్షంలో మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ హాసమ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి సర్దార్ మంజీత్ సింగ్‌లు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎండీ వారీస్ నవాబ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కొందరు వ్యక్తులు సంఘానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వారికి సంఘం తరపున క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ఆరేళ్లు సంఘం నుంచి బహిష్కరించాలని సమావేశంలో తీర్మానించారు. అదేవిధంగా సంఘానికి సభ్యులకు సంబంధించిన పలు సమస్యలు చర్చించి వాటికి అనుగుణంగా తీర్మానాలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన గంగిపల్లి నర్సయ్యను సత్కరించి రూ.10వేల చెక్కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు ఈరవేణి పద్మారావు ముదిరాజ్, అడ్వయిజర్ అలీమ్ ఖాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగరావు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు భోగె ప్రసాదరావుతో పాటు జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ డ్రైవర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా వెంకటకిష్టయ్య

విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటకిష్టయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి ముగ్గురు నామినేషన్లు వేసినప్పటికీ ఇద్దరు ఉపసంహరించుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారిగా జహంగీర్ అలీ, సహాయకులుగా సాబీర్, రెండో ఎన్నికల అధికారిగా భాస్కర్ వ్యవహరించారు.

విహారం.. విషాదం కావొద్దు




తిమ్మాపూర్: లోయర్ మానేరు జలాశయానికి సందర్శకుల తాకిడి పెరిగింది. శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో మానేరు తీరాన్ని తిలకించేందుకు కరీంనగర్ పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి ప్రజలు బారులు తీరారు. వాహనాలన్నీ నీళ్ల వరకు వెళ్తుండడంతో ఏదైనా ప్రమాదం జరగవచ్చనే ఉద్దేశంతో ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. సందర్శకులు ప్రమాదాలకు గురికావొద్దనే ఉద్దేశంతో కట్టమీద భారీకేడ్లు, బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

దరఖాస్తు చేసుకోండి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల రైతులు రైతుబీమాకోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీ వరకు పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు ఏఈవోలను సంప్రదించాలని కోరారు. ఆధార్, పాసుపుస్తకాల జిరాక్స్ ప్రతులతో పాటు నామినీ ఆధార్ జతచేసి దరఖాస్తు ఫారాన్ని ఆయా గ్రామాల క్లస్టర్ ఏఈవోలకు అందించాలని కోరారు. ఈనెల 13వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని, 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14లోపు జన్మించిన వారు పథకానికి అర్హులన్నారు.

శంకరపట్నం: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకున్న రైతులు మండల వ్యవసాయ కార్యాలయంలో రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏవో వెంకటేశ్ సూచించారు. దరఖాస్తు పారంతో పాటు పట్టాపాసు బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు అందించాలని కోరారు.

హుజూరాబాద్: రైతులు రైతు బీమా కోసం ఈ నెల 13 లోపు దరఖాస్తు చేసుకోవాలని హుజూరాబాద్ ఏడీఏ సునీత ఆదివారం ప్రకటనలో తెలిపారు. రైతు బీమా కోసం సంబంధిత దరఖాస్తు ఫారం భూమి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ నామినీ జిరాక్స్ పత్రాలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కోరారు.

అలుగుపారుతున్న పారువెల్ల చెరువు


బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు


అలుగుపారుతున్న పారువెల్ల పెద్ద చెరువు


పారువెల్ల- గన్నేరువరం మధ్య స్తంభించిన రాకపోకలు

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామ పెద్ద చెరువు అలుగుపారుతోంది. ఆదివారం మండలంతో పాటు సిద్దిపేట జిల్లా బెజ్జంకి, రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలాల్లో భారీ వర్షం కురవడంతో చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. అలుగుపారడంతో పారువెల్ల నుంచి గన్నేరువరం గ్రామాల మధ్య లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఇబ్బందులు పడ్డారు. హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వరదనీరు గన్నేరువరంలో పెద్ద చెరువులోకి చేరుతుండటంతో ఆ చెరువు సైతం అలుగు పారనుంది.